'అక్రమ ఆర్జనతో కొడుకు ప్రాణం తీసుకున్న ఓ డాక్టర్ కథ'

# హత్య

శ్రీకృష్ణ



ఫ్యూన్ పుల్లయ్య కాలేజీ ఎన్నికల నోటిఫికేషన్ తీసుకొచ్చి అంటించాడు. నోటీస్ బోర్డుమీద.

ఎక్కడో కబుర్లు చెప్పుకుంటూ అమ్మాయిలకి సైటు కొట్టే వాళ్ళదగ్గర్నుంచి చదువే తమ ధ్యేయంగా భావిస్తున్న వాళ్ళ వరకూ అబ్బాయిలు, అమ్మాయిలు అందరూ ఆత్రంగా నోటిఫికేషన్ చూసి ఆనందంగా అరుపులు మొదలెట్టారు.

ఆ కాలేజీలో ఏం జరిగినా జరక్క పోయినా ప్రతి సంవత్సరం ఎన్నికలు మాత్రం జరుగుతాయి. ఎందరో అమాయికులు బలి కావటానికి ఎం.పి. ఎన్నికలకన్నా భీకరంగా సాగుతాయి.

ఎండవేడి కన్నా ఎక్కువగా సాగుతోంది ఎన్నికల ప్రచారోద్యమం డాక్టర్ కొడుకైన రాఘవ తండ్రి అక్రమంగా సంపాదించిన డబ్బంతా ఖర్చయినా సరే గెలవాలనే పట్టుదలతో ఉన్నాడు. అతనికి తీవ్రమైన పోటీ ఇస్తున్నాడు సురేష్.

ఎన్నికల ప్రచారంలో ఎదురయ్యాయి రెండు వర్గాలు. ఎన్నికల సంగ్రామం మొదలయ్యింది. నినాదాలతో మొదలైన గొడవ తలలు పగిలేవరకూ రావడంతో తప్పదన్నట్టు కలుగజేసుకున్నారు పోలీసులు.

పగిలిన సురేష్ తలనుండి కారిన రక్తం చూసిగాని శాంతించలేదు రెండువర్గాలు. పోలీసుల జోక్యంతో ఆగింది ఎన్నికల రణరంగం.

ఎన్నికలు ముగిసాయి. ఫలితాలకోసం వేచివున్నాయి రెండు వర్గాలు. ఓట్లు లెక్కింపు ముగిసింది. అతి స్వల్ప మెజార్టీతో విజయం సాధించాడు రాఘవ.

* * *

ఇది జరిగిన నెలరోజులకే నడిరోడ్డుపై రక్తంలో తేలింది రాఘవ శవం. పోలీసులు అరెస్టు చేశారు. కోర్టులో విచారణ మొదలయ్యింది.

"నీపేరు" ప్రశ్నించాడు పబ్లిక్ ప్రాసిక్యూటర్ "సురేష్" సమాధానమిచ్చాడు. హతుడిగా అనుమానింపబడిన వ్యక్తి.

"రాఘవ నీకు శత్రువా?" పి.పి

"అలా అని ఎవరన్నారు?" సురేష్

"చూడు మిస్టర్ అడిగినదానికి సమాధానం చెప్పు". "సరే రాఘవకి నాకూ శత్రుత్వంలేదు"

"ఎన్నికలలో ఓడిపోయావన్న కోపంతో రాఘవని కత్తితో పొడిచి నీవే చంపావు. అవునా?"

"కాదు రాఘవని నేను చంపలేదు. అందుకు సాక్ష్యం ఇదుగో" అంటూ ఓ కాగితాన్ని పి.పి.కి అందించాడు సురేష్.

అది పరిశీలించిన పి.పి. జడ్జికి అందిస్తూ "యువరానర్ హతుడిగా అనుమానింపబడ్డ సురేష్ , రాఘవ హత్యజరిగిన సమయంలో హాస్పిటల్‌లో ఉన్నట్లుగా హతుడి తండ్రి డాక్టర్ మోహన్ ఇచ్చిన మెడికల్ సర్టిఫికెట్. ఇది నిజమో కాదో తేలాలంటే డాక్టర్ మోహన్‌ని కోర్టులో హాజరుపర్చాలని కోర్టువారిని కోరుతున్నాను"

"మీపేరు" ఆనవాయితీగా ప్రశ్నించాడు పి.పి.

"మోహన్"

"మీరు ఏం చేస్తుంటారు?"

"డాక్టర్‌ని. ప్రయివేట్ నర్సింగ్ హోమ్ నడుపుతున్నాను."



"ఐసీ ఈ మెడికల్ సర్టిఫికెట్ మీరు ఇచ్చిందేనా?"

మెడికల్ సర్టిఫికెట్ పరిశీలించి "అవును." అన్నాడు డాక్టర్ మోహన్.

పదిరోజులక్రితం జరిగిన సంగతి లీలగా మెదిలింది.......

"సార్" ఎవరో ఒక వ్యక్తి వచ్చి పిలిచాడు. "యస్. ఏం కావాలి నీకు" ప్రశ్నించాడు డాక్టర్ మోహన్. పది రోజులు మీదగ్గర ట్రీట్‌మెంట్ తీసుకున్నట్లు మెడికల్ సర్టిఫికెట్ కావాలి. లేకపోతే హాజరు చాలక నన్ను కాలేజీ నుంచి డిస్మిస్ చేస్తారు." అమాయకంగా ఆత్రుతగా చెప్పాడా వ్యక్తి.

"ఖర్చవుతుంది" చాలా సింపుల్‌గా చెప్పాడు. అక్రమంగా ఆర్జించడం అలవాటైన డాక్టర్ మోహన్.

"ఎంతైనా ఫరవాలేదండీ" అన్నాడావ్యక్తి పర్సు తీస్తు.

"నీ పేరు" లెటర్‌పాడ్ పైరాస్తూ అడిగాడు. "ఎం. సురేష్".

అడిగినంత చెల్లించి వెళ్ళిపోయాడావ్యక్తి. ఇది జరిగిన మరుసటిరోజే రాఘవ హత్య జరిగింది.

అప్పటికి గుర్తుకు వచ్చింది ముద్దాయిగా బోనులో నుంచున్న సురేష్ ఆరోజు మెడికల్ సర్టిఫికేట్ తీసుకెళ్ళిన వ్యక్తని.

"ముద్దాయిగాఅనుమానింపబడిన సురేష్ హతుడైన రాఘవ హత్య జరిగిన సమయాన హతుడి తండ్రి డాక్టర్ మోహన్ వద్ద చికిత్స పొందుతున్నట్లు ఋజువు కావటం వలన సురేష్‌ని నిరపరాధిగా భావించి విడుదల చేస్తు ఈ కేసును ముగించడమైనది" అన్న న్యాయమూర్తి తీర్పు స్టీరియో ఫోనిక్ సౌండ్‌లో వినపడింది డాక్టర్ మోహన్‌కి.

సురేష్ తన కొడుకుని చంపడానికే పధకం వేసుకుని తన దగ్గరే మెడికల్ సర్టిఫికెట్ తీసుకున్నాడన్న నిజం తెల్సి బోనులోకే కుప్ప కూలిపోయాడు డాక్టర్ మోహన్. *